క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : నగరంలోని రవీంద్రనగర్‌లోని ఉర్దూ అకాడమి, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు కంప్యూటర్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉర్దూ అకాడమి డైరెక్టర్ అయూబ్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాస్ అయిన ముస్లిం మైనారిటీలు సెంటర్ ఇంచార్జ్ అబ్దుల్ జహీర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 9985210282 నెంబర్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆలయ హుండీ సొమ్ము లెక్కింపు

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీమృత్యుంజయేశ్వరస్వామి ఆలయం హుండీ సొమ్మును శనివారం లెక్కించారు. ఆలయ ఈవో ఏ. శ్రీధర్, కడప గ్రూపు టెంపుల్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు అర్చకులు సతీష్, శశిధర్‌ల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మే నెల 22వ తేదీ నుంచి నేటి వరకు హుండీ ఆదాయం మొత్తం రూ.71,541 ఉన్నట్లు వారు తెలిపారు.

తగ్గిన టమాటా ధరలు

కడప అగ్రికల్చర్ : టమాటా ధరలు తగ్గుతున్నాయి. ప్రస్తుతం కిలో టమాట రైతు బజార్‌లో రూ. 72కు విక్రయిస్తున్నారు. మొన్నటి వరకు కిలో రూ. 100 ఉండగా 4వ తేదీన కిలో రూ. 90 చేరింది. అలాంటిది 5వ తేదీకి మరింత తగ్గి కిలో రూ. 72 చేరింది. దీంతో వినియోగదారులకు ఉపశమనం కలిగింది. కాగా టమాటా ధరలు రెండు మూడు రోజుల్లో మరింత తగ్గే అవకాశం ఉన్నట్లు రైతు బజార్ సిబ్బంది తెలిపారు. ఈ ధరలు మండుతున్న నేపథ్యంలో ప్రభుత్వం సబ్సిడీ కింద బయట ప్రాంతం నుంచి టమాటాలను రైతు బజార్‌కు తెప్పించి కిలో రూ. 50 వినియోగదారులకు అందించింది.

తల్లి పాలతో బిడ్డకు ఆరోగ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్: బిడ్డ సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలను మించిన శ్రేష్టమైన ఆహారం మరొకటి లేదని కడప అర్బన్ సీడీపీఓ సునంద, కమ్యూనిటీ కోఆర్డినేటర్ కెతుర తెలిపారు. శనివారం నగరంలోని ప్రకాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం వినియోగం, తల్లి పాల ప్రాముఖ్యత గురించి వివరించారు. బిడ్డ పుట్టిన అరగంటలోపే ముర్రుపాలను తాగించాలని, బిడ్డ పుట్టిన నాటి నుంచి ఆరునెలల పాటు బిడ్డకు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. తల్లి పాలు పట్టించడం ద్వారా శిశువుల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందింపచేయవచ్చని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రేణుక, ఏఎస్‌ఎం కళావతి పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ



మహిళలకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కడప కల్చరల్ : స్థానిక లోహియనగర్‌లోని అంగన్‌వాడీ పాఠశాలలో శనివారం మహిళలు, బాలలకు దుస్తులను అందచేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పోతుల వెంకట్రామిరెడ్డి అధ్యక్షన జరిగిన ఈ కార్యక్రమానికి ఇన్‌టాక్ జిల్లా కన్వీనర్ కే. చిన్నపురెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంగన్‌వాడీ టీచర్ లక్ష్మినరసింహ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ మహిళల్లో 50 మందికి చీరెలు, 25 మంది చిన్నారులకు దుస్తులు, బిస్కెట్‌లను అందచేశారు. కార్యదర్శి కొండూరు జనార్థన్‌రాజు, కోశాధికారి దేవతి రవీంద్రనాథ్, లయన్లు కే. సంజీవరెడ్డి, కోటా సత్యనారాయణ, బోగాల కొండారెడ్డి, పి.సుశీల్, మునికుమార్, కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : కాంట్రాక్టు ఉద్యోగుల తరహాలో ఆప్కాస్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరుతూ ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ శనివారం కలెక్టరేట్ ఎదుట ఒకరోజు నిరాహారదీక్ష నిర్వహించింది. ఫెడరేషన్ నాయకులు వెంకటసుబ్బయ్య, రవి ప్రకాష్‌లు మాట్లాడుతూ ఆప్కాస్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింప చేయాలన్నారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలలో వ్యత్యాసం ఉండరాదన్నారు. ప్రభుత్వం ఆప్కాస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 14వ తేదీ నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమానికి అందరూ తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు చంద్రారెడ్డి, సుదర్శన్, ఏసన్న, సురేష్, రఘుశంకర్‌రావు, రాజరత్నం తదితరులు దీక్షలో పాల్గొన్నారు.

నేడు సంఘ సేవకులకు సన్మానం

కడప రూరల్ : నూర్‌బాష్ దూదేకుల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సంస్థ కార్యాలయంలో సంఘ సేవకులకు సన్మాన కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు రసూల్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకేసుల బాదుల్లా తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే కార్యక్రమంను జయప్రదం చేయాలని కోరారు.

ప్రభుత్వ పథకాలతో మహిళా సాధికారత

డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల మహిళా సాధికారత ఏర్పడుతోందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం 'కార్యక్రమంలో భాగంగా 45వ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్, రామాలయం గుడి తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల వారికి కలుగుతున్న లబ్ధిని తెలుసుకున్నారు. ఇంకా ఏవైనా పథకాలు అర్హులకు అందడం లేదా ..అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సి. వెంకట సుబ్బమ్మ అనే మహిళ మాట్లాడుతూ తమకు ఆరోగ్యశ్రీ, వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ పింఛన్ కానుక, ఈబీసీ నేస్తం, జగనన్న ఇంటి స్థలం ద్వారా రూ.9.73లక్షల మేలు చేకూరిందని సంతోషం వ్యక్తం చేసింది. కె. లక్ష్మి అనే మహిళ మాట్లాడుతూ తమకు వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ సున్నావడ్డీ, వైఎస్సార్ పింఛన్ కానుక, జగనన్న ఇంటి స్థలం వల్ల రూ.9.52లక్షల లబ్ధి చేకూరిందని, గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇంత మేలు జరగలేదని తెలిపారు. మోనిక అనే మహిళ మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఇంటి స్థలం ద్వారా రూ.8.67లక్షల మేలు జరిగిందని తెలిపారు. పేదలకు సాయం చేస్తున్న ఈ ప్రభుత్వమే మళ్లీ రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ ఇన్‌చార్జి జి. శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు షఫీ, బాలస్వామిరెడ్డి, శ్రీరంజన్‌రెడ్డి, పవర్ అల్తాఫ్, ఎస్. సుబ్బారెడ్డి, మున్నా, తోటక్రిష్ణ, మియ్యా, సమరనాథరెడ్డి, రహీమ్, టీపీ వెంకట సుబ్బమ్మ, బండి మరియలు పాల్గొన్నారు.

నీటి సమస్య అరికట్టాలి..

కడప నగరంలో తాగునీటి సమస్యలను అరికట్టాలని షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నగర అధ్యక్షుడు పి. ఖాదర్‌బాషా కోరారు. శనివారం డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరానికి తాగునీరు సరఫరా అయ్యే ప్రధాన పైపులైన్లకు అనేక చోట్ల లీకేజీలు ఉన్నాయని, వాటిని అరికట్టాలని కోరారు.

నవోదయ, సైనిక్‌స్కూల్ ప్రవేశాల మెటీరియల్ ఆవిష్కరణ

వైవీయూ : కడప నగరం భగత్‌సింగ్‌నగర్‌లోని దిన్నెపాటి బసిరెడ్డి వికాస్ స్కూల్ యాజమాన్యం రూపొందించిన నవోదయ, సైనిక్‌స్కూల్ ప్రవేశాల మెటీరియల్‌ను ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషా ఆవిష్కరించారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మెటీరియల్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా భావించే సైనిక్‌స్కూల్, మిలటరీ స్కూల్, నవోదయ విద్యాలయ వంటి విద్యాసంస్థల్లో సీటు సంపాదించేందుకు అవసరమైన మెటీరియల్‌ను అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దిన్నెపాటి బసిరెడ్డి, డైరెక్టర్ శివకళ, 45వ డివిజన్ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి గుత్తిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, సీకే దిన్నె మండల ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత మందులను అమ్మితే చర్యలు



మాట్లాడుతున్న కడప ఏడీఏ సుబ్బారావు

కడప అగ్రికల్చర్ : ప్రభుత్వం నిషేధించిన పురుగు మందులను డీలర్లు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని కడప అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం నగరంలోని కడప మండల వ్యవసాయ కార్యాలయంలో పురుగు మందులు, ఎరువుల డీలర్లకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లంతా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులనుగానీ, పురుగు మందులను కానీ అమ్మాలన్నారు. అలా కాకుండా అధిక ధరలకు అమ్మితే చర్యలు ఉంటాయన్నారు. అలాగే ప్రభుత్వం నిషేధించిన గ్లైసైల్, ఫోరేట్, ఎండోసల్ఫాన్ మందులను అమ్మకూడదన్నారు. అలా ఎవరైనా అమ్మితే చర్యలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

నేడు సమన్వయ కమిటీ సమావేశం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కడప కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం కడప, అన్నమయ్య, చిత్తూరు, సత్యసాయి, అనంతపురం జిల్లాల కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజక వర్గాల సమన్వయ కమిటీ కన్వీనర్ల సమావేశాలను నిర్వహించనున్నారు. ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఏఐసీసీ మెంబర్ బండి జకరయ్య శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమానికి పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, ఏఐసీసీ కార్యదర్శి, ఏపీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మేయప్పన్, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ హాజరవుతున్నట్లు తెలిపారు.

ప్రతి గ్రామానికి తాగునీటిని అందించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలోని ప్రతి గ్రామానికి తాగునీరు, ప్రతి ఎకరాకు సాగునీటిని అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో ప్రతి గ్రామానికి తాగునీరు, ప్రతి ఎకరాకు సాగు నీటి సాధన కోసం ఈ నెల 7 నుంచి సెప్టెంబరు 15 వరకు నియోజక వర్గాలలో సదస్సు, ప్రచార జాతాలు, 30, 31న బస్సుయాత్ర చేపట్టి సెప్టెంబరు 16న కడప నగరంలో జరిగే మహాసభలను జయప్రదం చేయాలన్నారు.

విభజన హామీల అమలు కోసం ఉద్యమిద్దాం

కడప రూరల్: రాష్ట్ర విభజన హామీల కోసం ఉద్యమిద్దాం అని ఆర్‌వైఎఫ్ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు కొరాణి షిబు, రాజీవ్ బెనర్జీ అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక వైఎస్సార్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ విభజన హామీల అమలుతో రాష్ట్ర మరింతగా అభివృద్ధి చెందడానికి వీలు కలుగుతుందన్నారు. యువత విభజన హామీల కోసం ఉద్యమించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్‌గా నేరెళ్ల కళ్యాణ్, కో కన్వీనర్‌లుగా సుబ్బరాయుడు, నరసింహప్రసాద్, వెంకటేష్, లోకేష్‌లను నియమించారు.

కడప ఒన్‌టౌన్‌లో వ్యక్తి హల్‌చల్

కడప అర్బన్ : కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లోకి చొరబడి స్వరాజ్‌కుమార్ అనే వ్యక్తి హల్‌చల్ చేశాడు. తానే రాయితో తలపై కొట్టుకుని, స్టేషన్ ఆవరణలోని బండలను పగులగొట్టాడు. శనివారం ఈ సంఘటన చోటుచేసుకుంది. స్వరాజ్ కుమార్ తాను 2021లో బంధువులపై ఫిర్యాదు చేశానని, ఆ కేసు ఏమైందని వచ్చి హల్‌చల్ చేశాడు. ఈక్రమంలోనే ఓ కానిస్టేబుల్‌కు సంబంధించిన హెల్మెట్‌ను తీసుకుని అతనిపైనే దాడి చేశాడు. మరోవైపు విధుల్లో వున్న మహిళా కానిస్టేబుల్ పట్ల పరుషపదజాలంతో దూషించాడు. పోలీస్‌స్టేషన్‌లో ఫర్నీచర్‌ను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో అతనిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు కడప ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు తెలియజేశారు.

కాస్మోటిక్స్ చార్జీలు చెల్లించాలి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రభుత్వ వసతి గృహాలలో పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్స్ చార్జీలు వెంటనే చెల్లించాలని ఆర్‌ఎస్‌వైఎఫ్ నాయకులు ఓరుగంటి నాగేంద్రబాబు, ఆజాద్, రాఘవ, రాజశేఖర్ తదితరులు శనివారం కలెక్టరేట్ ఏఓ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆరు నెలలుగా చార్జీలు చెల్లించనందున హాస్టల్ వార్డన్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హాస్టళ్ల నిర్వహణ కష్టమైపోయిందన్నారు. నిధులు విడుదల చేయాలని కోరారు.

అసైన్‌మెంట్ కమిటీల్లో మాజీ సైనికులకు అవకాశం కల్పించాలి

వైవీయూ : జిల్లాలోని మాజీ సైనికుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే అసైన్‌మెంట్ కమిటీల్లో మాజీ సైనికులకు ఈసీ మెంబర్లుగా అవకాశం కల్పించాలని మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పి. లక్ష్మినారాయణ ఒక ప్రకటనలో కోరారు. ఉమ్మడి వైఎస్‌ఆర్ కడప జిల్లాలోని అన్ని మండల, డివిజన్ కేంద్రాల్లో మాజీ సైనికుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని కోరారు.

విద్యాసంస్థల్లో ర్యాగింగ్ నిషేధం



మాట్లాడుతున్న జడ్జి ప్రదీప్‌కుమార్

కడప అర్బన్ : విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌ను నిషేధించడంతో పాటు, విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపే శిక్షాస్పద నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్ తెలియజేశారు. జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో శనివారం కడపలోని జిల్లా కోర్టు ఆవరణంలో న్యాయసేవాసదన్‌లో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ 1997లో తమిళనాడు రాష్ట్రం తొలిసారిగా ర్యాగింగ్‌కు సంబంధించిన చట్టాలను ఆమోదించిందన్నారు. విశ్వ జాగృతి మిషన్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యానికి ప్రతి స్పందనగా 2001 మే లో భారత సుప్రీంకోర్టు తీర్పు ద్వారా ర్యాగింగ్ వ్యతిరేక ప్రయత్నాలకు పెద్ద ఊపు లభించిందన్నారు. కొన్ని సెక్షన్‌లతో కూడిన వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జడ్జి ఎస్. కవిత, ట్రైనీ న్యాయమూర్తులు ఎస్.కె మొహిద్దీన్, నందిని, అనిల్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు చంద్రకాంతమ్మ, ప్రభాకర్, సైక్రియాటిస్ట్ డాక్టర్ వెంకటరాముడు, సోషల్ వర్కర్ దశరథరామిరెడ్డి, రిటైర్డ్ ఎంఈఓ వి. నాగమునిరెడ్డి, వివిధ మెడికల్, ఫార్మసీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపల్స్, ప్రొఫెసర్స్ పాల్గొన్నారు.

■ కడపలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో ర్యాగింగ్ నిషేధంపై అవగాహన సదస్సును నిర్వహించారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని జడ్జి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం డైరెక్టర్‌గా రామప్రసాద్‌రెడ్డి



ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డికి నియామక పత్రాన్ని అందజేస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులుగా తెలుగుశాఖ ప్రొఫెసర్ ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి నియమితులయ్యారు. శనివారం వైవీయూలో వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాహితీ రంగం, గ్రంథాలయ పరిపాలనలో విశేష అనుభవం కలిగిన ఆచార్యులు.. సీపీ బ్రౌన్ కేంద్రం అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. ఆచార్య రామప్రసాద్‌రెడ్డి వైవీయూలో హ్యుమానిటీస్ డీన్‌గా, తెలుగుశాఖ ఆచార్యులుగా, రాయచోటి పీజీ సెంటర్ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సీపీ బ్రౌన్ పరిశోధన కేంద్రం ఖ్యాతిని మరింత విస్తరించేలా నిబద్ధతతో పని చేస్తానన్నారు.


మనోవికాసానికి క్రీడలు దోహదం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ప్రత్యేక అవసరాలు గల పిల్లలలో ఆత్మస్థైర్యం నింపడంతోపాటు వారిలో మనోవికాసం కలిగించడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ వల్లూరు బ్రహ్మయ పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఇండోర్ క్రీడా మైదానంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశంలోని ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు కలిగించాలని సూచించిందన్నారు. అయితే కొందరికి శారీరక, మానసిక వైకల్యం సంభవించగా వాటిని అధిగమించేందుకు ప్రభుత్వం వారికి అవకాశాలు కల్పిస్తోందన్నారు. అటువంటి ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఆటలపోటీలు నిర్వహించడం ద్వారా ఉత్సాహం, ఆనందంతోపాటు వారిలో దాగి వున్న ప్రతిభను వెలికి తీసేందుకు దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రత్యేక అవసరాలు గల పిల్లలు హాజరయ్యారన్నారు. వీరికి రన్నింగ్, స్లో వాకింగ్ వంటి క్రీడా పోటీలను క్రీడా శిక్షకులు లక్ష్మి, రాయుడు, కళ్యాన్, సుదర్శన్, శంకర్ రెడ్డిలు నిర్వహించారు. ఇందులో విజేతులుగా నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహిత విద్యా సమన్వయకర్త మిట్టా కేశవరెడ్డి, సహాయ సమన్వయకర్త రమణమూర్తి, అన్నమయ్య జిల్లా సహిత విద్యా సమన్వయకర్తలు జనార్ధర్, రవి, మమత, గంగులప్ప, విజయమ్మ, సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్రాల గడ్డలో తనిఖీ



గుర్రాల గడ్డలో తనిఖీ చేస్తున్న పోలీసులు

కడప అర్బన్ : జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిల్లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. శనివారం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిల్లో రౌడీషీటర్లుగానీ, చెడు నడత కలిగిన వారుగానీ, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు. కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐ ఎన్.వి నాగరాజు ఆధ్వర్యంలో ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, తమ సిబ్బందితో కలిసి గుర్రాల గడ్డ ప్రాంతంలో క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

విద్యుత్ స్తంభాలను వెంటనే మార్చాలి



రోడ్ల విస్తరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : అంబేడ్కర్ సర్కిల్- వై జంక్షన్ వరకూ జరుగుతున్న విస్తరణ పనుల్లో విద్యుత్ స్తంభాలను వెంటనే మార్చాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. శనివారం గోకుల్ లాడ్జి రోడ్డు, దేవునికడప రోడ్డు, మాసాపేట రోడ్డు, కేసీ కెనాల్ రోడ్ విస్తరణ పనులను ఆయన ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, విద్యుత్, ఆర్‌అండ్‌బి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అంబేడ్కర్ సర్కిల్–వై జంక్షన్ మార్గంలో డ్రైనేజీ కాలువ పనులను వెంటనే పూర్తి చేసి, వాటర్ పైపులైన్ పనులను ప్రారంభించాలన్నారు. గోకుల్ లాడ్జి వద్ద ఏర్పడిన వ్యర్థాలను తక్షణం తొలగించాలని, డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించాలన్నారు. క్రిష్ణా సర్కిల్– మార్కెట్ యార్డు వరకూ డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టాలన్నారు. కేసీ కెనాల్ రోడ్డును 33 అడుగులు నిర్మించాలన్నారు. అంతకుముందు మార్నింగ్ విజిట్‌లో అసిస్టెంట్ కలెక్టర్ భరద్వాజ్‌తో కలిసి కో ఆపరేటివ్ కాలనీ, భాగ్య నగర్ కాలనీల్లో పర్యటించారు. పారిశుద్ధ్య కార్మికుల హాజరు పట్టికలను తనిఖీ చేశారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా స్వీకరించాలని, కమర్షియల్ వ్యాపారుల నుంచి ప్రతిరోజూ చెత్త స్వీకరించాలన్నారు. కాలువల్లో ఆహార పదార్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, వేస్ట్ మెటీరియల్ వేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. మానవత శ్మశాన వాటికకు వెళ్లే మార్గంలో రోడ్డు నిర్మాణం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ నాగేంద్ర, విద్యుత్ శాఖ ఈఈ నరసింహప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాధనతో ఉన్నత శిఖరాలు



వ్యక్తిత్వ వికాస నిపుణుడు సుబ్రమణ్యంను సన్మానిస్తున్న అధ్యాపకులు

వైవీయూ : నిరంతర సాధనతో విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం వైవీయూలో ఆంగ్లశాఖ, పూర్వ విద్యార్థుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో 'ఉన్నత లక్ష్యాలు, వ్యక్తిత్వ వికాసం, మానవీయ విలువలు' అన్న అంశంపై ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సానుకూల ఆలోచనలు విజయం వైపు తీసుకెళ్తాయన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు, వైవీయూ పూర్వ విద్యార్థి బి. సుబ్రమణ్యం మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయస్థాయి విజేతలు, ప్రఖ్యాత వ్యక్తులకు ఒక్కరోజులో గుర్తింపు లభించదని, ఎన్నో దశాబ్దాలు శ్రమిస్తే కానీ ఆ స్థానానికి చేరుకోలేమన్నారు. కార్యక్రమంలో ఆంగ్లశాఖ ఆచార్యులు డాక్టర్ పుత్తా పద్మ, డా. మెర్సీ విజేత, డా. జయంత్‌కశ్యప్, డా. అంకన్న, వైవీయూ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డా. టి. సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి పి. చిట్టిబాబు, డా. వై. హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి



మొక్కలు నాటుతున్న అధ్యాపకులు

వైవీయూ/ కడప కల్చరల్ : పర్యావరణాన్ని పరిరక్షించుకోవడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని రెడ్‌క్రాస్ సొసైటీ స్పెషలాఫీసర్ శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 'నా మట్టి.. నాదేశం' కార్యక్రమంలో భాగంగా వనం–మనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాల సంబరాల్లో భాగంగా నేలను కాపాడుకునే ప్రయత్నంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం కళాశాల ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గురుమోహన్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. జి. విజయలక్ష్మీదేవి, డా. పి. శచీదేవి తదితరులు పాల్గొన్నారు.

డీఈఓపై ఆర్‌జేడీ విచారణ



ఫ్యాప్టో నాయకులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ వెంకట క్రిష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ఇటీవల ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులపై అక్రమాలు చోటు చేసుకున్నాయనే దానిపై ఫ్యాప్టో నాయకులు జిల్లా కలెక్టర్‌తోపాటు ఆర్‌జేడీకి ఫిర్యాదు చేశారు. అలాగే డీఈఓ వ్యవహారశైలి కూడా సరిగా లేదంటూ వారు ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఆర్‌జేడీ వెంకట క్రిష్ణారెడ్డి తమ కార్యాలయంలో డీఈఓపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులను విచారించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బదిలీలు, పదోన్నతులకు సంబంధించి పలు అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. పదోన్నతి పొంది మూడేళ్లు దాటిన ఎఫ్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలకు నిబంధనలకు భిన్నంగా రివర్షన్ ఇచ్చి వారికి 16 శాతం హెచ్‌ఆర్‌లో నియామకాలు చేపట్టారన్నారు. పాఠశాల సహాయకులుగా పదోన్నతి ఇచ్చిన కొద్ది రోజులకే వారి కోరిక మేరకు వారందరికి కూడా 16 శాతం హెచ్‌ఆర్‌ఏ స్థానాలకు కట్టబెట్టారన్నారు. 20 అంశాలపై ఆధారాలతో ఆర్‌జేడీకి పత్రాలను అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో కడప జిల్లా చైర్మన్ విజయ్‌కుమార్, ఫ్యాప్టో నాయకులు వెంకటసుబ్బయ్య, పాలెం మహేష్‌బాబు, అబ్దుల్లా, హరికొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పోటీ ప్రపంచంలో నైపుణ్యత చాలా ముఖ్యం



సమావేశంలో మాట్లాడుతున్న కడప కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ రమణారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యత చాలా ముఖ్యం అని కడప కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని స్మిత్ రోడ్‌లోని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో డిజిటల్ అండ్ సోషల్ మీడియాపై అవేర్‌నెస్ ప్రోగ్రాం జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రమణారెడ్డి మాట్లాడుతూ సచివాలయంలో పనిచేస్తున్న ప్రతి సిబ్బందికి నైపుణ్యత చాలా అవసరమన్నారు. అలాగే ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాల మీద ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. శిక్షణ అనంతరం వార్డు సెక్రటరీలకు సర్టిఫికెట్లను, మెటీరియల్‌ను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కడప కార్పొరేషన్ సూపరింటెండెంట్ రవిబాబు, నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : పెన్షనర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని పెన్షనర్ల కార్యాలయంలో నెలవారి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవీ విరమణ చెందిన ఉద్యోగులకు న్యాయంగా రావాల్సిన పీఆర్‌సీ, డీఆర్ బకాయిలను వెంటనే ఇవ్వాలన్నారు. కార్యదర్శి రామ్మూర్తి నాయుడు మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ ఏర్పాటు చేసి జులై నెల జీతంతో పాటు ఒక డీఏను కలిపి చెల్లించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పెన్షనర్లకు రావాల్సిన మిగతా బకాయిలను వాయిదా వేయకుండా నగదు రూపంలో చెల్లించాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ రాధాకృష్ణలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్య నిర్వాహక కార్యదర్శి బాలయల్లారెడ్డి, మహిళా కార్యదర్శి అపూర్వ సుందరి, సంఘ కోశాధికారి నాగేస్‌తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే వారికి భవిష్యత్తులో మంచి అవకాశాలు

చెన్నూరు : ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ తమ పరిధిలో సహాయ సహకారాలు అందించే ప్రతి ఒక్కరికి భవిష్యత్తులో మంచి అవకాశాలు వస్తాయని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం పంచాయతీ కార్యాలయ ఆవరణంలో చెన్నూరు సహకార సొసైటీ అధ్యక్షుడు అల్లి శ్రీరామ్మూర్తి ప్రమాణ స్వీకారోత్సవానికి ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీ కులానికి చెందిన అల్లి శ్రీరామ్మూర్తి చెన్నూరు రామలింగ చౌడేశ్వరిదేవి ఆలయ చైర్మన్‌గా తన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించి అందరికి ఆదర్శంగా నిలిచారన్నారు. అలాంటి వ్యక్తికి చెన్నూరు సహకార సొసైటీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించామన్నారు. అనంతరం చైర్మన్‌గా ఎన్నికైన అల్లి శ్రీరామ్మూర్తి, డైరెక్టర్లుగా ఉప్పరపల్లె గ్రామ పంచాయతీకి చెందిన గాజులపల్లె సంపూర్ణరెడ్డి, కొండపేటకు చెందిన గంగులయ్యలచేత ప్రమాణ స్వీకారం చేయించారు.